

బ్రిటిష్ వారికి అనుకూలంగా ఉన్నారని రాజా రామ్మోహన్ రాయ్ మీద విమర్శలెక్కుపెట్టి ఖండించడం, అలాగే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదని వివేకానందుని తూలనాడటం... ఇలాంటివి తెలుసు. ఇక గాంధీజీని ఖండించాలన్నా, విమర్శించాలన్నా, దూషించాలన్నా నేడు మితిమీరిన స్వేచ్ఛతో, విశృంఖలంగా సాగుతున్నారు. మతం, కులం, ప్రాంతం, పార్టీ, భావజాలం వగైరా కారణాలతో అహేతుకమైన ధోరణిలో గత పదేళ్లుగా ఈ తంతు ఆధునిక టెక్నాలజీ చేయూతతో నడుస్తున్నది. తొలుత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కేంద్రంగా మొదలైన ఈ దుష్ప్రచారం, తర్వాతి కాలంలో మహాత్మాగాంధీ వైపు మళ్లి తారాస్థాయికి చేరింది. ఎందుకు? ఏమిటి?.. అనే ప్రశ్నలు చాలామందికి కలుగుతున్నాయి.. ఎందుకిలా జరుగుతున్నది... ఏమిటి వాస్తవమని! ఆరేడేళ్లుగా గాంధీజీకి సంబంధించి లోతైన పరిశీలన పరిశోధన చేసిన వ్యక్తిగా ఈ 2024 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ విషయం గురించి కొంత దృష్టి పెట్టి చర్చించాల్సిన అవసరముంది అనిపిస్తున్నది.

**బాపు పోరాట నేపథ్యం..**

గాంధీజీ భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటం మొదలుపెట్టి పదేళ్ల క్రితమే వందేళ్లు దాటింది. తన రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే సలహా మీద గాంధీజీ 1915,16 ప్రాంతంలో ఈ సమాజాన్ని ఓ సంవత్సరం పాటు రైలు ప్రయాణం చేస్తూ నేరుగా పరిశీలించి, అధ్యయనం చేసి; తర్వాత కార్యాచరణకు దిగిన వ్యక్తి. తగిన ఉపాధి దొరకని కారణంగా దక్షిణాఫ్రికా వెళ్లిన యువ లాయర్ తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించడం, అందులోభాగంగా అక్కడ స్థిరపడిన భారతీయులను సమీకరించి ఏకతాటిన నడిపిన అనుభవం గల సాధకుడు కూడా ఆయనే. గాంధీజీ రాజకీయ రంగప్రవేశం చేసేనాటికి లోకమాన్య బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలే, బిపిన్‌చంద్రపాల్, అరవింద్ ఘోష్, లాలా లజపతిరాయ్ వంటి మహనీయులు తమదైన ధోరణిలో కృషిని దేశంలో వివిధ ప్రాంతాల్లో ప్రారంభించారు.

అప్పటికే తొలి స్వాతంత్ర్య సంగ్రామాన్ని మొదలుపెట్టి, విఫలమైన మనదేశం పూర్తిగా బ్రిటిష్ రాణి ఏలుబడిలోకి వచ్చేసింది. అదే సమయంలో ఈ తెల్లదొరల ప్రతినిధులు తమ చట్టాలకు మరింత క్రౌర్యాన్ని కలగలిపి ఇక్కడ పాలన సాగిస్తున్నారు. అటువంటి సంధి సమయంలో ఘర్షణలకు తలపడకుండా సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని కొందరు వినతులతో, మహజరులతో ఉపక్రమించాలన్నారు. ఆ దరిమిలా 1885 చివరలో 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్' ముంబయిలో తొలి సమావేశం జరిగింది. కొంత కాలానికి



స్వాతంత్ర్య సాధనకు సంబంధించి నాయకులు అతివాదులు, మితవాదులు అని రెండు వర్గాలుగా విడిపోయి, తమదైన పద్ధతుల్లోకి దిగిపోయారు. బ్రిటిష్ వారు మాత్రం వీటిని గమనిస్తూ మౌనంగా ఎందుకుంటారు? వారి డొంకతిరుగుడు చర్యలు వారివే!

విక్టోరియా రాణి ప్రతినిధి అయిన భారతదేశపు వైస్రాయ్ లార్డ్ కర్జన్ 1905 జూలై 16న బెంగాల్ విభజనను ప్రకటించారు. బెంగాల్ ప్రెసిడెన్సీగా పిలవబడే ప్రాంతంలో పశ్చిమ వైపున హిందువులూ, తూర్పు వైపున ముస్లింలు అధికంగా ఉండేవారు. దీన్ని గమనించి ఆ తెల్లవారు ఈ విభజనను ప్రతిపాదించి



దేశంలో రగులుతున్న జ్వాలలకు మరింత ఆజ్యం పోసేశారు. మన దేశం వదిలి వెళ్లేటప్పుడు కూడా దేశ విభజనకు ప్రయత్నించి, విజయం సాధించారు. అలాగే మనదేశంలో ఉన్న 584 సంస్థానాలకు స్వాతంత్ర్యం ఇస్తున్నట్టు కూడా ప్రకటించి మరింత అల్లకల్లోలాన్ని పెంచారు. అప్పుడు మొదలైన విద్వేషాలు నేటికీ చల్లారలేదనడం అతిశయోక్తి కాదేమో! బెంగాల్ విభజనతో దేశం అట్టుడికిపోయి వందేమాతరం ఉద్యమానికి దోహదం చేసింది.

**దక్షిణాఫ్రికా అనుభవం**

భారతీయుల మధ్య కులం, మతం, ప్రాంతం, భాష, సంస్కృతి అనే అడ్డుగోడలు చాలా సనాతనమైనవి, పురాతనమైనవి ఇంకా బలమైనవని గాంధీజీకి దక్షిణాఫ్రికాలోనే బోధపడింది. పరిశీలించి, అధ్యయనం చేసి బాగోగులు గమనించి నిర్ణయం తీసుకునే స్వభావం గాంధీజీది, కనుకనే ఆయన స్వీయచరిత్ర నామకరణంలో 'ప్రయోగాలు' అనే మాట మనకు కనబడుతుంది. దక్షిణాఫ్రికాలో బ్రిటిష్ ప్రభుత్వంతో ఇబ్బందులు పడుతున్న భారతీయులను ఒక తాటి మీద నిలపడానికి చేసిన ప్రయత్నాలు తర్వాత దశలో భారతదేశంలో ఉద్యమం నడపడానికి గాంధీజీకి ఎంతో దోహదం చేశాయి. కనుక ఆయన ఈ మతాన్ని, కులాన్ని, విశ్వాసాల్ని, సంస్కృతుల్ని బహిరంగంగా విభేదించకుండానే చాకచక్యంగా ప్రణాళికను సిద్ధం చేశారు. మాటలో, వాదనలో పారుష్యం అసలు లేకుండా చాలా జాగ్రత్త తీసుకున్నారు. అన్ని మత విశ్వాసాల్లో ఉన్న ఉపయోగపడే మంచిని మాత్రమే స్వీకరించాలనే ధోరణిలోఆలోచించారు. అలాగే ఈ మతాలన్నీ చెప్పే దయ, అహింస, కారుణ్యం, క్షమ, సత్యం వంటి గుణాలు రాజకీయరంగంలో కూడా చాలా కీలకమైన పాత్ర పోషించగలవని నమ్మడమే కాకుండా ప్రవేశపెట్టి, రుజువు కూడా చేశారు.

